సాక్షి సంగారెడ్డి

బుధవారం ၊ 31 ၊ జనవరి ၊ 2024



స్వచ్ఛతలో సిద్దన్నపేట భేష్

ఇంటింటా చెత్త సేకరిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటంతో సిద్దన్నపేట స్వచ్ఛ సిద్దన్నపేటగా నిలిచింది.

వివరాలు 8లో ▸



ఆపరేషన్ కోసం వచ్చి..

ఇందుర్తి మండలం చిగురుమామిడికి చెందిన వేముల రాజేశ్వరి కిడ్నీస్టోన్ శస్త్రచికిత్స కోసం వచ్చి విగతజీవిగా మారింది.

వివరాలు 8లో ▸



అదనపు భారం తగ్గేనా?

ఈ పంచాయతీ ఆపరేటర్లు అదనపు పనిభారంతో సతమతం అవుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఒకరికి కరోనా పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఏడుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అలాగే ఐదుగురికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించారు.

పిల్లలను పనిలో పెట్టొద్దు

పటాన్‌చెరు టౌన్: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గొల్లపల్లి వీరేశం అన్నారు. ఆపరేషన్ స్మైల్-10లో భాగంగా మంగళవారం అమీన్‌పూర్ పరిధిలోని గ్రీన్ విజోస్ వద్ద సెంట్రింగ్ కాంట్రాక్టర్ చంద్రశేఖర్ బాల కార్మికుడితో పని చేయించడాన్ని గుర్తించారు. దీంతో ఆ కాంట్రాక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజీవ్ విగ్రహానికి తొలగిన ముసుగు



రాజీవ్‌గాంధీ విగ్రహం

సాక్షి ఎఫెక్ట్

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ కాసాల గ్రామ శివారులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి ముసుగు తొలగించారు. 'కోడ్ ముగిసిన.. తొలగని ముసుగు' అనే శీర్షిక మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు దౌల్తాబాద్ సర్పంచ్ వెంకటేశంకు ఫోన్‌చేసి ముసుగు తొలగించాలని సూచించారు. ఆయన గ్రామపంచాయతీ సిబ్బందితో రాజీవ్ గాంధీ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగింపజేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కోహీర్(జహీరాబాద్): పదో తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మంచి మార్కులు సాధించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ అన్నారు. సాలార్ మిల్లర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు శివకువకుమార్, బాబీ, మహేశ్వర్, బద్రొద్దీన్, ఇలియాస్ అహ్మద్, మహ్మద్‌షకీల్, ఆనంద్, అహ్మద్ అసిబొద్దీన్, వికార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



సమస్యలు వింటున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ లక్ష్యమని నారాయణ ఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. మంగళవారం ఖేడ్ ఆర్టీసీ డిపోలో డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ఖేడ్ నుంచి బోరంచకు బస్సులు నడపాలని రాణాపూర్‌కు చెందిన రాజేష్ ఫోన్ చేసి కోరారు. న్యాల్‌కల్‌కు చెందిన సిద్దయ్య ఖేడ్ నుంచి న్యాల్‌కల్, ఝరాసంగం మీదుగా జహీరాబాద్, న్యాల్‌కల్ మీదుగా బీదర్‌కు బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. సదాశివపేటకు చెందిన కొండయ్య ఖేడ్ నుంచి లింగంపల్లి, వట్‌పల్లి, కంకోల్ మీదుగా సదా శివపేటకు బస్సు నడపాలని కోరగా, ఖేడ్‌కు చెందిన ఇమ్రాన్ బీదర్‌కు బస్సులను పెంచాలని కోరారు. సమస్యలు విన్న డీఎం వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నిధులు లేక నిస్తేజం!

- రైతు వేదికల్లో కొరవడిన నిర్వహణ
- ఏడాదిగా విడుదల కాని డబ్బులు
- ఇబ్బందుల్లో ఏఈఓలు

సాగులో అధునాతన పద్ధతుల గురించి ఎప్పటికప్పుడు అన్నదాతలకు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలు వృథాగా మారాయి. రైతులంతా ఒకేచోట సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వీటిని నిర్మించింది. ఆలోచన మంచిదే అయినప్పటికీ.. ఆచరణలో మాత్రం శూన్యంగా కనిపిస్తోంది. నిధులు లేక రైతువేదికల నిర్వహణ భారంగా మారింది. అధ్వానస్థితికి చేరిన వాటిల్లో సభలు, సమావేశాలు నిర్వహించక నిరుపయోగంగా మారాయి.

– కొండాపూర్(సంగారెడ్డి)



జిల్లాలో గత ప్రభుత్వం 106 రైతు వేదికలను నిర్మించింది. క్లస్టర్ స్థాయిలో 2021లో వీటిని ఏర్పాటు చేసింది. ఒక్కో దానికి రూ.22 లక్షల నిధులు మంజూరు చేసింది. మొత్తం రైతు వేదికల నిర్మాణానికి రూ.23.32కోట్లు వెచ్చించారు. సీజన్‌ల సమయంలో తప్ప వీటి నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా రైతు సంక్షేమం కోసం నిర్మించిన వేదికలను ప్రస్తుతం నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో రైతువేదిక నిర్వహణలో వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓ) ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆరంభ శూరత్వం

ప్రారంభ సమయంలో రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నెలకు రూ.9 వేల చొప్పున నిధులు విడుదల చేసింది. వీటిలో పరిశుభ్రతకు రూ.3 వేలు, శిక్షణ ఖర్చులు రూ.2500, స్టేషనరీ, జిరాక్స్ రూ.1000, విద్యుత్ చార్జీలు రూ.1000, మరమ్మతుల కోసం రూ.1000, తాగునీరు అవసరాలకు రూ.500 ఖర్చు చేసేవారు. దీంతో నిర్వహణ సవ్యంగా సాగింది. కానీ 15 నెలలుగా ఈ నిధులు విడుదల కావడం లేదు. దీంతో రైతువేదికలు అపరిశుభ్రంగా మారడంతో ఏఈఓలు అటు వైపు వెళ్లడానికి కూడా ఇష్టపడటం లేదు. నిధులు లేక శుభ్రం చేసేవారు కూడా రావడం లేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

కొన్ని రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించడంతో వాటికి రక్షణ లేకుండా పోయింది. కొన్ని ప్రాంతాల్లో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు రాక నిత్యం శుభ్రం చేయించడం, తాగునీటి ఏర్పాటుతో పాటు ఇతరత్రా పనులు క్షేత్రస్థాయి అధికారులకు తలకు మించిన భారంగా మారింది. నిర్వహణ ఖర్చులు అందించి యాసంగి సీజన్ లోపు రైతు వేదికలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పోతిరెడ్డిపల్లి రైతు వేదిక



రైతు వేదికలలోనే ఏఈఓలు

వ్యవసాయ విస్తరణాధికారులు ఉదయం ఫీల్డ్‌కు వెళ్లి మధ్యాహ్నం తమ క్లస్టర్‌కు సంబంధించిన రైతు వేదికలలోనే ఉంటున్నారు. వాటి నిర్వహణకు గతంలో నిధులు వచ్చేవి. సంవత్సర కాలంగా రావడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిపై ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. త్వరలోనే రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– నర్సింగరావు, జిల్లా వ్యవసాయాధికారి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పక్కాగా ఓటరు జాబితా సవరణ


కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: అర్హులందరూ ఓటరు జాబితాలో ఉండాలని, స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడానికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఫారం6, 7, 8ల ప్రాసెస్ ప్రక్రియ, డిస్పోజల్స్ తీరు, ఫైళ్లను పరిశీలించారు. అనంతరం రాజకీయ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. బీఎల్‌ఓల విషయంలో ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పూర్తి ఆధారాలతో మృతిచెందిన వారి, డూప్లికేట్ ఓటర్లను తొలగిస్తున్నామని చెప్పారు. ఫారం6 ఓటర్ నమోదుకు సంబంధించి అడ్రస్ ప్రూఫ్, బీఎల్‌ఓ రిపోర్ట్ ఆధారంగా అప్రూవ్ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ దేవుజా, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దారులు పాల్గొన్నారు.

సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

వట్‌పల్లి(అందోల్): అధిక సాంద్రతతో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె. రాహుల్ విశ్వకర్మ, సరిత అన్నారు. మంగళవారం వట్‌పల్లిలోని రైతువేదిక భవనంలో రైతుసదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కూలీల కొరత అధిగమించాలంటే యాంత్రీకీకరణను ఉపయోగించుకోవాలని సూచించారు. మొక్కల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల కలుపు సమస్య తగ్గుతుందన్నారు. అలాగే చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. సాగులో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేట్టాలన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

అనంతరం రాజేంద్రనగర్ విద్యార్థులు ఏర్పాటుచేసిన వ్యవసాయ నమూనాల ఎగ్జిబిషన్ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ ఎస్ఏ హుస్సేన్, అమీర్‌బాషా, టి.శోభారాణి, ఏడీఏ శివకుమార్, ఏఓ మహేష్‌చౌహాన్, ఈఓలు భాగేష్, దీపిక, పరిమల, నరేష్, నర్సింహారెడ్డి, సిద్దు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కల్హేర్, సిర్గాపూర్ మండలం వంగ్దల్, నిజాంపేటలో పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పక్కా వ్యూహంతో పనిచేసి అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌ను ఓడించానని గుర్తు చేశారు. ఎంపీ ఎలక్షన్స్‌లో జహీరాబాద్ బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. పార్టీ అధికార ప్రతినిధి జన్వడే సంగప్ప, నాయకులు సంగమేశ్వర్ రావు, అల్లపూరం రాజు, పుల్లన్నగారి అభిలాష్, పరుశరాం, పడమటి సాయిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): సరిహద్దులో దేశం కోసం పోరాడుతున్న సైనికుల్లా బీజేపీ కోసం కార్యకర్తలు పనిచేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం కంగ్టిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బద్దం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్ టౌన్: రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. చదువుతో పాటు చట్టాల గురించి తెలిసి ఉండాలన్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలు అధిగమించడానికి అవి తోడ్పడుతాయన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల మానసిక, శారీరక ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, పోక్సో, బాల కార్మిక, సమాచార, జువైనైల్ జస్టిస్ చట్టాల గురించి వివరించారు. బాల కార్మికులు, బాల్య వివాహ బాధితులను గుర్తిస్తే తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. 1098 నంబర్‌కు కూడా సమాచారం ఇవ్వొచ్చని చెప్పారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి సోలోమాన్, సంతోష్ కుమార్ సాగర్, న్యాయవాదులు గోపాల్, సందీప్ కుమార్, మానిక్ పాటిల్, గురురాజ్ కులకర్ణి, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లు జే.రాములు, కేఎస్.జమీల్, కాలేజీ కోఆర్డినేటర్ డి.నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలకు వేళాయే..

- రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- జిల్లా వ్యాప్తంగా 85 కేంద్రాలు ఏర్పాటు

సంగారెడ్డి అర్బన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 15 రోజుల పాటు జరిగే ఈ ప్రాక్టికల్స్ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. పర్యవేక్షణ కోసం జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులను ఫ్లయింగ్ స్క్వాడ్లుగా నియమించారు. ప్రాక్టికల్స్ ముగిశాక 28వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

మూడు విడతలుగా..

జిల్లాలో 88 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 18 ప్రభుత్వ, 3 కేజీబీవీ, 29 గురుకుల కళాశాలలు, 38 ప్రైవేటు కళాశాలలున్నాయి. ప్రయోగ పరీక్షలకు అవసరమైన పరికరాలు, వసతులు అధికారులు సిద్ధం చేశారు. మొత్తం 26,864 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యేందుకు 85 కేంద్రాలను గుర్తించారు. వీటిల్లో మూడు విడతలుగా పరీక్షలు నిర్వహిస్తారు. మొదటివిడత ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు, రెండో విడత 6 నుంచి 10 వ తేదీ వరకు, మూడో విడత 11 నుంచి 15 వ తేదీ వరకు పరీక్షలు జరపనున్నారు. ఎంపీసీ విద్యార్థులు 11,981 మంది, బైపీసీ 5,731 మంది, వృత్తి విద్య కోర్సుల్లో మొదటి సంవత్సరం వారు 5,151మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,001 మంది ప్రయోగ పరీక్షల్లో పాల్గొననున్నారు. ప్రయోగ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను అరగంట ముందుగా ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో ఉంచనుంది. తరువాత సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జిల సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేస్తారు. దీనికనుగుణంగా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది.



కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

ఏర్పాట్లు పూర్తి

ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా పరీక్షల కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. ప్రయోగ పరీక్షలకు అవసరమైన పరికరాలు, వసతులు సిద్ధం చేశాం.

గోవిందరామ్, జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

- అందోల్-జోగిపేట ఆర్డీఓ పాండు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ పాండు

జోగిపేట(అందోల్): విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదివతే పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయని అందోల్-జోగిపేట ఆర్డీఓ పాండు అన్నారు. మంగళవారం అందోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దని, పక్కా ప్రణాళికతో చదవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల వంటగదిలోని కూరగాయలు, కిరాణా వస్తువులను పరిశీలించారు. నాణ్యత కలిగిన సామగ్రిణిని ఉపయోగించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు. తహసీల్దారు, ఆంటోని, సీఐ నాగరాజు, గురుకుల పాఠశాల సూపరింటిండెంట్ గంగాధర్, ఉపాధ్యాయులు అజ్మత్ బేగం, సునీత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయండి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

జహీరాబాద్ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ఆరోపించారు. ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన గ్రామీణ బంద్ కోసం మహీంద్ర అండ్ మహీంద్ర ట్రాక్టర్ ప్లాంట్ కార్మికులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి పంపనున్న వినతిపై కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం చుక్క రాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు పెద్దపీట వేస్తూ కార్మికులు, ప్రజలు, రైతుల నడ్డి విరుస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందన్నారు. వీటన్నింటికి నిరసనగా ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, సలహాదారులు మహిపాల్, మహీంద్ర యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, వంశీకృష్ణ, బాబు, మహేశ్వర్, రాజేష్ పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో చుక్క రాములు

పాతపంటల బండి.. తండాలో సందడి

జహీరాబాద్: మండలంలోని అర్జున్‌నాయక్, మోడ్ తండాల్లో పాతపంటల జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయా తండాల్లో పాతపంటల ప్రాధాన్యత గురించి సర్పంచ్ సవిత బాయి వివరించారు. ఈ సందర్భంగా ఆమె చిరుధాన్యాల ప్రదర్శనతో వచ్చిన ఎడ్ల బండ్లకు పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. జాతర కోఆర్డినేటర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. 23 ఏళ్ల నుంచి డీడీఎస్ ఆధ్వర్యంలో పాతపంటల జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రసాయన ఎరువులతో పండించిన పంటల ఆహారం తిని అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. చిరు ధాన్యాలతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. వీటికి ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా రైతులు పారు నాయక్, చాందిబాయి, అమ్రిబాయి, రాజిబాయిలు మాట్లాడుతూ.. తండా ప్రజలకు చిరుధాన్యాలు అంటే చాలా ఇష్టమన్నారు. ఈ పంటల సాగుకు డీడీఎస్ ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ప్రతికూల వాతావరణంలోనూ ఇవి పండుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ సభ్యులు టి.మంజుల, చుక్కమ్మ, పూలమ్మ, చిన్న నర్సమ్మ, జనరల్ నర్సమ్మ, అల్గోల్ నర్సమ్మ, చంద్రమ్మ, శ్రీలయ, బిందు, ఏలియా, తండా రైతులు తదితరులు పాల్గొన్నారు.



పాతపంటల జాతరకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

సంగారెడ్డి టౌన్ : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ఆ సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడాదిగా వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన మెస్ బిల్లులు సుమారు రూ.5,600కోట్ల బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. వీటి విడుదలలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. దీంతో 14లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను పునర్ నిర్మించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం అందించాలని అన్నారు. ఎర్రోళ్ల మహేష్, రాజేష్, వాణి, సాక్షి, రవి, కిరణ్ గౌడ్, అజయ్, హరీష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

ప్రశ్నిస్తే అసహనం ఎందుకు?

- దాడులు చేస్తే ఊరుకోం
- చైర్మన్‌కు క్షమాపణ చెప్పాలి
- జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు, నాయకులకు అసహనం ఎందుకని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రజల మనోభావాలను కించపరిచేలా మంత్రుల వ్యవహార శైలి ఉందన్నారు. భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మీద జరిగిన దాడిని ఖండించారు. ఆయనకు మంత్రి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షించాల్సిన పోలీసులు క్యాబినెట్ హోదా ఉన్న జెడ్పీ చైర్మన్‌ను నెట్టివేయడం సరికాదన్నారు. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్టు ఆమె తెలిపారు. దాడులకు పాల్పడితే ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి చర్యలు లేవన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శర్మ, నాయకులు ఎల్లారెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు అడ్డుకున్న మట్టి టిప్పర్‌లు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తుండడంతో మంగళవారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. స్థానికంగా ఉన్న కంకర క్రషర్‌ల నుంచి అక్రమంగా రాత్రి సమయంలో మట్టిని అక్రమార్కులు తరలిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులు ఈ విషయాన్ని రెవెన్యూ, పోలీసులకు తెలియజేశారు.

ప్రిన్సిపాల్‌పై చర్యకు డిమాండ్

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మత ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల నాయకులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. మంగళవారం భజరంగ్‌దళ్ కన్వీనర్ సుబాస్‌చందర్ ఆధ్వర్యంలో ఎంఈఓ అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సిబా మాడల్ కళాశాలలో క్రైస్తవ మత బోధనలు చేయిస్తుందని ఆరోపించారు.

క్రషర్లపై టాస్క్‌ఫోర్స్ సర్వే

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని లక్డారం గ్రామంలో క్రషర్లపై టాస్క్ ఫోర్స్ అధికారులు సర్వే చేపట్టారు. నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్డీఓ నేతృత్వంలో ఇటీవల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఆ టీమ్ క్రషర్లపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. ఏ మేర అనుమతులున్నాయి, నిబంధనలు అతిక్రమించారా అనే విషయాలపై ఆరా తీశారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న పీడీ

దుబ్బాకరూరల్: ఉపాధి హామీ పనులపై మండల ఎంపీపీ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు పీడీ కౌసల్యాదేవి హాజరై 2022–23 సంవత్సరంలో జరిగిన పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలతో పాటుగా స్వాహా చేసిన నిధులను రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత, ఏపీడీ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతలో సిద్దన్నపేట భేష్



పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్



తాగునీటి ట్యాంక్ వద్ద నిర్మించిన ఇంకుడు గుంత

- ఇంటింటికీ ఇంకుడు గుంతలు
- ప్లాస్టిక్ నిషేధం.. మురుగు రహితం
- జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు సొంతం
- జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపిక

నంగునూరు(సిద్దిపేట): ఇంటింటా చెత్త సేకరిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచమే కాకుండా మౌలిక వసతుల కల్పన, మహిళలకు అవగాహన కల్పించడంతో మండలంలోని సిద్దన్నపేట స్వచ్ఛ సిద్దన్నపేటగా నిలిచింది. చెత్త సేకరణ, మురుగు దొడ్లు, నల్లా కనెక్షన్లు, ఇంకుడు గుంతలు నిర్మించడంతో పరిశుభ్రంగా మారింది ఈ గ్రామం. దీంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులు సొంతం చేసుకుంది. అంతేకాదు కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు కూడా నామినెట్ అవడం పరిశుభ్రతకు అద్దంపడుతోంది.

శుభ్రతకు చర్యలెన్నో..

నంగునూరు మండలం సిద్దన్నపేటలో ప్రభుత్వం డంపింగ్ యార్డు నిర్మించడంతో పంచాయతీ సిబ్బంది ఇంటింటా తిరిగి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి సేంద్రియ ఎరువుగా తయారుచేస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, రెండు ఇంకుడు గుంతలు నిర్మించారు. సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి ట్యాంక్‌లు, మురుగుకాల్వల చివరలో ఇంకుడు గుంతను ఏర్పాటుచేసి మురుగుకు చెక్ పెట్టారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించి స్టీల్‌బ్యాక్స్‌లు ఏర్పాటు చేశారు. మహిళలు రసాయన రహిత మెనుస్ట్రువల్ కప్పులను వినియోగించేలా అవగాహన కల్పించి వాటిని ఉచితంగా పంపిణీ చేశారు.

ఉట్టి పడుతున్న పచ్చదనం

హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ ద్వారా అధిక సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. మౌలిక వసతుల కల్పనలో బాగంగా తాగునీటి ట్యాంక్‌లు, మరుగుదొడ్లు, వైకుంఠదామం, ఓపెన్‌జిమ్, సామాజిక భవనాలు నిర్మించారు.

అవార్డులు సొంతం..



గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు చేస్తున్న కృషి ఫలితంగా జిల్లా, రాష్ట్ర స్థాయి బహుమతి గెలుచుకున్నాం. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారం, సూచనలతో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాం. దీంతో గ్రామం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు నామినేటైంది.

– దాకూరి కనకవ్వ, సర్పంచ్, సిద్దన్నపేట

ఆదర్శంగా నిలవడం హర్షణీయం



అధికారుల సూచనలు, గ్రామ పాలక మండలి, పంచాయతీ సిబ్బంది కృషితో గ్రామం స్వచ్ఛ సిద్దన్నపేటగా మారి అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించడంతో పాటు మురుగు రహితంగా తీర్చిదిద్దడంతో ప్రజలను వ్యాధుల బారిన పడకుండా కాపాడుతున్నాం.

– బెదురు తిరుపతి, ఎంపీటీసీ, సిద్దన్నపేట

గ్రామస్తుల సహకారంతో గుర్తింపు



గ్రామం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచేందుకు ప్రజలు చాలా సహకరించారు. అది ఎంతో అభినందనీయం. సర్పంచ్, ఎంపీటీసీ, ఉన్నతాధికారుల సహకారంతో గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దాం. జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉంది.

– రవీందర్, పంచాయతీ కార్యదర్శి

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక



ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్‌కు ఎంపికైన క్రీడాకారులు

మిరుదొడ్డి(దుబ్బాక): అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి మెదక్ జిల్లా బాల బాలికల జట్లను ఎంపిక చేశామని మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జిల్లా జనరల్ సెక్రెటరీ పీవీ. రమణ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. బాలుర జట్టులో మిరుదొడ్డికి చెందిన వేముల సిద్ధార్థ, మద్దెల అనిల్, ఎం.ప్రణయ్, ఆర్‌సీ పురానికి చెందిన కె.అనికేత్, జి.తన్విష్, శశాంక్, సోమేశ్, అశోక్ నగర్‌కు చెందిన ఎస్.భరత్‌రాజ్, ఎస్.మోహిన్, ఓల్డ్ ఎంఐజీకి చెందిన ఎస్.కృష్ణసాయి, ఎం.చైతన్య, అంబేద్కర్ నగర్‌కు చెందిన కె.నవీన్ ఎంపికయ్యారని తెలిపారు. బాలికల జట్టులో ఎమ్ఐజీకి చెందిన ఇ.తానియా, ఎల్.అఖిల, సఫియా నిఖత్, రామచంద్రాపురానికి చెందిన కె.భవాని, ఓల్డ్ ఎంఐజీకి చెందిన పి.శ్రీలక్ష్మి, ఎల్.అఖిల, యస్.శ్రావణి, బీహెచ్ఈఎల్‌కు చెందిన బి.రాధిక ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 9 నుంచి, 11 వరకు జరిగే 68వ రాష్ట్ర స్థాయి అండర్–19 జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

దళితబంధు ఇప్పిస్తానంటూ వసూళ్లు

తిరిగి ఇవ్వాలంటూ బాధితుల ధర్నా



నిరసన తెలుపుతున్న బాధితులు

మద్దూరు(హుస్నాబాద్): దళితబంధు ఇప్పిస్తామని తమ నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వాలని సర్పంచ్ ఇంటి ఎదుట బాధితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూళ్మిట్ట మండల పరిధిలోని తోర్నాల సర్పంచ్ కుమారుడు భిక్షపతి దళితబంధు ఇప్పిస్తానని గ్రామంలోని ఆరుగురు దళితుల నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేశారన్నారు. బాధితులు మేక యాదగిరి, పంగ ఎల్లయ్య, పేరం రవి, మేక శేఖర్, పేరం పరశురాములు, ఎర్ర మల్లేశం మంగళవారం ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ కుమారుడు భిక్షపతి తమకు దళిత బంధు మంజూరు చేయిస్తానని, రెండేళ్ల క్రితం ఒక్కొక్కరి నుంచి రూ.1 చొప్పున తీసుకున్నాడని వాపోయారు. నేటికీ తమకు దళితబంధు డబ్బులు రావడం లేదన్నారు. బాధితులకు మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సుందరగిరి భాస్కర్ మాట్లాడుతూ భిక్షపతి తీసుకున్న డబ్బులు తిరిగి బాధితులకు ఇవ్వాలని, లేనిపక్షంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. భిక్షపతిని వివరణకోరగా దళితబంధు పథకం మంజూరు కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి ఆదేశాల మేరకే ఆరుగురి దగ్గర వసూళ్లు చేశానని చెప్పాడు. డబ్బులు తిరిగి బాధితులకు ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు.

ఆపరేషన్ కోసం వచ్చి విగతజీవిగా..

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆరోపణ



రాజేశ్వరి మృతదేహంతో బంధువుల ఆందోళన

సిద్దిపేటజోన్: కిడ్నీస్టోన్ శస్త్రచికిత్స కోసం వచ్చి ఓ మహిళ విగతజీవిగా మారింది. ఈ ఘటన సిద్దిపేటలో మంగళవారం ఆందోళనకు దారితీసింది. బాధితుల కథనం ప్రకారం.. ఇందుర్తి మండలం చిగురుమామిడికి చెందిన వేముల రాజేశ్వరి సోమవారం ఓ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. ఆమెను పరిశీలించిన వైద్యులు రాత్రి 11 తరువాత సర్జరీ చేశారు. సర్జరీ సమయంలో మహిళ పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు హుటాహుటిన సమీపంలో ఉన్న మరొక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహిళ చనిపోయినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీనితో మృతురాలి బంధువులు మంగళవారం తెల్లవారుజామున రాజేశ్వరి మృతదేహంతో శస్త్ర చికిత్స జరిగిన ఆసుపత్రిలో ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మహిళ చనిపోయిందని ఆరోపించారు. సర్జరీ సమయంలో రాజేశ్వరికి కార్డియక్ అరెస్టయి చనిపోయిందని, తమ నిర్లక్ష్యం ఏమీ లేదని వైద్యులు బదులిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువులకు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

‘టెలిగ్రామ్’లో పెట్టుబడి పేరుతో.. సైబర్ మోసం

- రూ.6.11లక్షలు మాయం

సిద్దిపేటకమాన్: టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి పేరుతో వచ్చిన లింకును ఓపెన్‌చేసి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించి బాధితుడు సైబర్ మోసానికి గురైన ఘటన పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకుంది. సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని గుర్తుతెలియని వ్యక్తి లింక్‌ను పంపించాడు. బాధితుడు ఆ లింక్‌ను ఓపెన్‌చేసి పలు విడతలుగా ఆన్‌లైన్‌లో రూ.6,11,108 జమచేశాడు. తర్వాత ఆ లింకును ఓపెన్ చేయగా బ్లాక్‌చేసి ఉండడంతో మోసపోయినట్టు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

అప్పుల బాధలు తాళలేక..

రియల్ వ్యాపారి ఆత్మహత్య



చెన్నకేశవరెడ్డి

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధలు తాళలేక ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలం పరిధిలోని రామేశ్వరం బండకు చెందిన చెన్నకేశవరెడ్డి(45) రియల్ ఎస్టేట్ వ్యాపారి. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి లేక్ వ్యూ విల్లాలో తన కుటుంబంలో నివాసం ఉంటున్నాడు. అయితే ఆయన చాలా చోట్ల అప్పులు చేశాడు. కొంతకాలంగా చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం అతడి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే వారు అతడి కోసం వెతకగా గ్రామంలో పొలంవద్ద గడ్డికి కొట్టే మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలోఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి తొలిత పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి మరో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం అర్ధరాత్రి అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మంగళవారం భార్య శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రంలోని మన్నెల్లికి చెందిన వినోద్(35) మరో వ్యక్తి బైక్‌పై వెళుతుండగా బుర్దిపాడ్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. వినోద్ అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం

- గ్యాస్ సిలిండర్ లీక్.. తప్పిన ప్రాణ నష్టం
- రూ.2లక్షల విలువైన సామగ్రి దగ్ధం



ప్రమాదం అనంతరం చిందరవందరగా హోటల్ కిచెన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ఆనంద్ దర్శని హోటల్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సిద్దిపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న ఆ హోటల్‌లో మంగళవారం ఉదయం కిచెన్‌లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో కిచెన్‌లోని వంట మనుషులు వెనుక ద్వారం నుంచి బయటకు పరుగులు తీయగా కస్టమర్‌లు భయంతో రోడ్డు మీదకు వచ్చారు. అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్‌లు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ అధికారి రాజ్‌కుమార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కిచెన్ రూంలోని ఎలక్ట్రిక్, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయి. ఎంటువంటి ప్రాణ నష్టం జరగలేదు. రూ.2లక్షల నష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్
- పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, అధికారులు



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

సిద్దిపేటరూరల్: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు పొలాలను పరిశీలించారు. కాండం తొలిచే పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ వరి పిలకలువేసే దశలో ఉందని ఈ సమయంలో రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. కాండం తొలిచే పురుగును గమనించడానికి దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగుపై నిఘా పెట్టాలని సూచించారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని, వారానికి బుట్టలో 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలని చెప్పారు. నారు నాటే వారం రోజుల ముందు ఎకరాకు సరిపడే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యురాన్ 3జి గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్ 3జి గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయసున్న వరి పైరులో యాసంగిలో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యురాన్ 3జి గుళికలు 10 కిలోలు, లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు, లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు నాలుగు కిలోలు వేయాలని సూచించారు. లార్వాదశ మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ లీటర్‌ల నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే జింక్ లోపం నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో తోర్నాల పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి, ఏరువాక శాస్త్రవేత్త విజయ్ కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు పద్మ, మండల వ్యవసాయ అధికారి రమణి, సర్పంచ్ , ఏఈఓ నాగార్జున, రైతులు నగేశ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కిష్టయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెన్నో వర్ణాలు...



లోకానికి వెలుగులు పంచేందుకు బయల్దేరిన భానుడు వస్తూ వస్తూ కొత్త అందాలను ఆవిష్కరించాడు. సన్నని మంచు పొరలను కరిగిస్తూ.. నీరెండను ప్రసరిస్తూ కనువిందు చేశాడు. ఆ వెలుగుల రేడు ప్రభావానికి పరిసరాలు స్వర్ణారుణ వర్ణాలు అద్దుకుని అందంగా మెరిశాయి. ఈ దృశ్యాలను సిద్దిపేటశివారుల్లోని కృష్ణసాగర్ సమీపంలో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

తాళం వేసిన ఉన్న ఇళ్లలో చోరీలు

- మూడు చోట్ల దొంగతనాలు
- రూ.70వేల నగదు, రూ.60వేల ఆభరణాలు అపహరణ



డాగ్ స్క్వాడ్‌తో వివరాలను సేకరిస్తున్న పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): తాళం వేసిఉన్న ఇళ్లలో దొంగలు చెలరేగిపోయారు. వేర్వేరు ఘటనల్లో మొత్తం రూ.70వేల నగదుతో పాటు రూ.60వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. మండల పరిధిలోని అల్వాలలో జరిగిన ఘటనలో గ్రామానికి చెందిన సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మ నవీన్, రొద్ద నర్సవ్వ తమ ఇళ్లకు తాళంవేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. తాళంవేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు సోమవారం అర్ధరాత్రి ఆ మూడిండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి బీరువాలో రూ.10 వేల నగదు, వెండి పట్టగొలుసులు, అర తులం బంగారు కమ్మలను దొంగలు ఎత్తుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరి ఇళ్లలోను చోరీకి యత్నించారు. కాని అక్కడ ఏమీ దొరక్కపోవడంతో వస్తువులను చిందర వందరగా పడేశారు. మంగళవారం ఉదయం దొంగతనం విషయం తెలుసుకున్న బాధితులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

చేర్యాలలో.. కడవేర్గు రోడ్డులో నివాసం ఉంటున్న పోతురెడ్డి దేవేందర్‌రెడ్డి ఈ నెల 26న తిరుపతి దైవ దర్శనానికి వెళ్లారు. వారు మంగళవారం తిరిగి వచ్చి ఇంట్లో దొంగలు పడినట్టు గమనించారు. రూ.60వేల విలువ గల బంగారు నగలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హుస్నాబాద్: ముదిరాజ్ కాలనీకి చెందిన వెల్దండి రాజేంద్ర ప్రసాద్ ఇంటో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బీరువాలో ఉన్న ఎనిమిది తులాల బంగారం, రూ.60 వేల నగదు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



రోడ్డుపై ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు.. ఇన్‌సెర్ట్‌లో నర్సింలు(ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): విధులు నిర్వహిస్తూ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన ఘటన ఏపీటోరియా యూనిట్ 1 పరిశ్రమలో చోటుచేసుకుంది. మండలంలోని బోరపట్ల గ్రామానికి చెందిన కొప్పు నర్సింలు(32) గ్రామ శివారులోని ఆ పరిశ్రమలో విధులు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రోజులాగానే విధులకు వెళ్లాడు. విధులు నిర్వహిస్తూ ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తోటి కార్మికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. పరిశ్రమ ప్రతినిధులు నర్సింలును సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపడంతో బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. యాజమాన్యం నిర్లక్ష్యానికి నిరసనగా బాధితులు ఆందోళనకు దిగారు. ఆ కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు బైఠాయించారు. యాజమాన్యంతో చర్చించి న్యాయం చేస్తామని సీఐ వేణుకుమార్ తెలిపారు.

12కిలోల గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆంధ్రప్రదేశ్ నుంచి కర్ణాటకకు గంజాయిని రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా కలిగి ప్రాంతానికి చెందిన అజయ్ సోమవారం సాయంత్రం లింగంపల్లి చౌరస్తాలో అనుమానాస్పదంగా సంచరించాడు. అనుమానం వచ్చిన పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 12కిలోల గంజాయి దొరికింది. అజయ్ తన 28న ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వెళ్లి కిలో రూ. 2500 చొప్పున 12 కిలోలు గంజాయిని కొనుగోలు చేశాడు. దానిని తీసుకొని కాకినాడ నుంచి లింగంపల్లి వరకు బస్సులో వచ్చాడు. కర్ణాటకకు వెళ్ళేందుకు రామచంద్రాపురంలోని లింగంపల్లి చౌరస్తా వద్దకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని కర్ణాటకలో అధిక ధరకు అమ్ముతున్నట్లు పోలీస్ విచారణలో తేలినట్టు చెప్పారు.